# అదీ మన ఘనత!



అది 21వ శతాబ్దం!

శాస్త్రీయ విజ్ఞానం అద్భుతమైన ప్రగతిని సాధించింది. గుండెలు మార్చినట్లుగానే మనుషుల మెదళ్లను మార్చడం కూడా సర్వసామాన్యం అయింది. పైగా... వాహనాలకు, యంత్రాలకు స్పేర్‌పార్ట్స్ దొరికినట్లు, అవసరమైన ప్రతి అవయవాన్ని విడిగా అమ్మే షాపులు వీధివీధినా వెలిశాయి.

ఒక దుకాణం కేవలం మానవ మస్తిష్కాలనే సేకరించి అమ్మడంలో ప్రత్యేకతను సంతరించుకుంది.

ఆ దుకాణంలో అద్దాల షోకేసులో రకరకాల ప్రపంచ ప్రజల మెదళ్లను సీసాలలోని ప్రత్యేక ద్రవాలలో చెడిపోకుండా నిలవ చేయబడి ఉన్నాయి. ప్రతీ సీసాపైన లేబుల్‌లో ఆ సీసాలోని మెదడు వివరాలు, వాటి ధరా రాసి ఉన్న లేబుళ్లు అంటించి ఉన్నాయి.

ఒకరోజున షాపింగ్‌కు బయలుదేరిన ఇద్దరు సర్దార్జీలు ఆ దుకాణంలో ప్రవేశించారు. అక్కడ ఉన్న మెదళ్లలోని ధరలలో ఎంతో వ్యత్యాస్యం ఉండటం వారికి ఆశ్చర్యాన్ని కలిగించింది. వారికి మరింత సంభ్రమాన్ని కలిగించిన విషయం... అన్ని మెదళ్లలోకీ సర్దార్జీల మెదడు ఖరీదు ఎక్కువగా ఉండడం!

అది చూడగానే ఆ సర్దార్జీల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.

ఆ ఇద్దరిలో ఒక సర్దార్జీ- "చూశావా... మన సర్దార్జీల ప్రత్యేకత! ప్రపంచంలో అన్ని జాతుల మెదళ్ల కంటె మన సర్దార్జీల మెదళ్లే ఎక్కువ ధర పలుకుతున్నాయి. నేను ఒకటి కొనుక్కొని వెడతాను" అన్నాడు.

రెండో సర్దార్జీ- "అవునవును. నేనూ గమనించాను. నేను కూడా ఒకటి కొంటాను" అన్నాడు. సర్దార్జీలు ఇద్దరూ ఇంక ఉండబట్టలేకపోయారు-

"మిగిలినవారి మెదళ్ల కంటే సర్దార్జీల మెదళ్లకే ధర ఎక్కువగా ఎందుకు ఉంది?" అని షాపు యజమానిని అడిగారు.

"అయ్యా! ఏం చెప్తాం? మేధావులు, ప్రముఖులు, మంచి తెలివితేటలున్నవారు చనిపోతే మేము వారి మెదళ్లను తీసి అమ్ముతాం. మిగతా అన్ని జాతుల్లోనూ మంచి తెలివితేటలు ఉన్న వారి మెదళ్లు మాకు తేలిగ్గానే దొరుకుతాయి. కాని, తెలివిగల సర్దార్జీల మెదడు దొరకడం అతి అరుదు. అందుకే వాటికింత ధర!" అన్నాడు షాప్‌కీపర్ చల్లగా.

"అలాగా! అయితే- నాకు రెండు సర్దార్జీల మెదళ్లు ఇయ్యండి" అన్నాడు మొదటి సర్దార్జీ. "నాకు నాలుగు కావాలి" అన్నాడు రెండవ సర్దార్జీ.

'ఇటువంటి సర్దార్జీల బేరం నెలకు ఓ పదొస్తే చాలు- ఏడాది తిరగకుండా కోటీశ్వరుడిని అయిపోతాను' అనుకుంటూ ముసిముసి నవ్వులు నవ్వుకున్నాడు షాప్ కీపర్.

- జయశ్రీ మాస పత్రిక... జనవరి '88